జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 10 | జనవరి | 2026 ◆ పేజీలు : 6



# ప్రజల కోరిక మేరకు గోదావరి నది హారతి

- ఈ వారం నుంచి ప్రతి ఆదివారం
- ఈ నెల 11న భద్రాచలం గోదావరి నది హారతి కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి:** ఏరు – ది రివర్ ఫెస్టివల్ లో భాగంగా భద్రాచలంలో గోదావరి నది హారతి కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజలు, భక్తులు, పండితుల నుంచి వచ్చిన సూచనల మేరకు వారి సలహాలను పరిగణ లోకి తీసుకొని, గత వారం ముందుగానే ప్రకటించిన ట్లుగా ఈ వారం నుంచి ప్రతి ఆదివారం నది హారతి

మిగతా 2 లో...





# రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- అశ్వారావుపేట నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయ పథకాల ప్రారంభం
- తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి/సహజ వ్యవసాయ విధానాల అమలుకు అశ్వారావుపేటను కేంద్రంగా చేసుకొని శ్రీకారం చుట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ, సహకార మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆది నారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని రైతు మేళా, టీజీ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష– ఆయిల్ పామ్ పత్రాల సమగ్ర పరిశీలనా ప్రయోగశాల, నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్

మిగతా 2 లో...

# ప్రభుత్వానికి అనువుగా గ్రామ పాలన కొనసాగాలి



- మున్సిపాలిటీలో 76 జీఓను పరిష్కరిస్తా
- రాష్ట్రవ్యాప్తంగా 69 శాతం కాంగ్రెస్ బలపరిచిన సర్పంచుల గెలుపు
- ఇందిరమ్మ సుపరిపాలన తోనే ఎన్నికల్లో మంచి ఫలితాలు
- వచ్చే మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలి
- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు
- నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించడమే లక్ష్యం
- ఇల్లందు పట్టణంలో రూ 3.17 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన:
- రాష్ట్ర మంత్రి పొంగులేటి

**ఇల్లెందు, జనవరి 9, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వానికి అనువుగా గ్రామాల్లో కొత్తగా ఏర్పడిన గ్రామ పాలన కొనసాగాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక జెకె కాలనీలోని సింగరేణి హైస్కూల్ క్రీడా ప్రాంగణం ( బ్లాక్ డైమండ్ స్టేడియం) లో జరిగిన ఇల్లందు నియోజకవర్గంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లను మంత్రి శాలువాలు, మెమెంటోలతో

మిగతా 2 లో...

# 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

– లొంగిపోయిన మావోయిస్టులలో 18 మంది మహిళలు ,45 మంది పురుషులు
–36 మంది మావోయిస్టులపై కోటి 19 లక్షల రివార్డు




**చర్ల, జనవరి 09: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ లో నక్సల్ ప్రభావిత బస్తర్ ప్రాంతంలో శాంతిని అభివృద్ధిని తీసుకురావడంలో భద్రతా దళాలు భారీ విజయాన్ని సాధించాయి . దంతెవాడ జిల్లాలో నిర్వహిస్తున్న "పునా మార్గెం (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం)" ప్రచారం ద్వారా ప్రభావితమై, మొత్తం 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు, వారిలో 36 మంది రివార్డులు

మిగతా 2 లో...

## దద్దరిల్లిన బయ్యారం...
# మారుమూల ఏజెన్సీలో క్రీడా సందడి

- - ఈ బయ్యారంలో ఎస్జీఎఫ్ అండర్–17 జాతీయ బాలుర కబడ్డీ పోటీలు
- - క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుంది
- - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**పినపాక,జనవరి 09(ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ బయ్యారంలో నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ (SGFI) అండర్–17 జాతీయ స్థాయి బాలుర కబడ్డీ పోటీలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలను తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా మైదానాన్ని పరిశీలించిన మంత్రి, కబడ్డీ మ్యాచ్ లను

మిగతా 2 లో...

## ప్రజల కోరిక మేరకు గోదావరి నది హారతి

(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గత రెండు శనివారాలలో భద్రాచలం గోదావరి ఘాట్ వద్ద నిర్వహించిన నది హారతి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ప్రజల సౌకర్యం, స్థానిక సంప్రదాయాల పరిరక్షణ, అలాగే కార్యక్రమానికి మరింత విస్తృత భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో గోదావరి నది హారతి కార్యక్రమాన్ని ఇకపై ప్రతి ఆదివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు, గోదావరి నది ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నది పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని గోదావరి నది సంరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## దద్దరిల్లిన బయ్యారం...

(మొదటి పేజీ తరువాయి...)

ఆసక్తిగా వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, క్రీడలు యువతను తప్పుదారి నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటు చేస్తాయని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు క్రీడాకారులను అభినందిస్తూ, ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ నియోజకవర్గంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించుకోవడం గర్వకారణమని చెప్పారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రతినిధులంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ, పోటీలు సజావుగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మిలు కూడా మాట్లాడి, క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. మొత్తంగా ఈ బయ్యారంలో జరుగుతున్న ఎస్జీఎఫ్ అండర్–17 జాతీయ బాలుర కబడ్డీ పోటీలు విజయవంతంగా కొనసాగుతుండగా, ప్రజాప్రతినిధుల సందర్శన క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ కరగూడెం మండల అధ్యక్షులు హుస్సేన్, మణుగూరు మండల అధ్యక్షులు గోపి,ఎస్జిఎఫ్ అధ్యక్షులు నరేష్, కంది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వభారత్ రెడ్డి, కంది సుబ్బారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త రెడ్డి, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పినపాక తహసిల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సిఐ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏఈ వేణు గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)



కలిగి ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై మొత్తం 1 కోటి 19 లక్షల 50 వేల రూపాయల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన మావోయిస్టులు దర్భా డివిజన్, సౌత్ బస్తర్, వెస్ట్ బస్తర్, మార్ ప్రాంతం ఒడిశా రాష్ట్రంలో చురుకుగా ఉన్నారు. వీరిలో 18 మంది మహిళలు మరియు 45 మంది పురుషులు మావోయిస్టులు ఉన్నారు. రివార్డులు తీసుకుంటున్న మావోయిస్టులలో రూ. 8 లక్షల రివార్డులతో 7 మంది మావోయిస్టులు, రూ. 5 లక్షల రివార్డులతో 7 మంది మావోయిస్టులు, రూ. 2 లక్షల రివార్డులతో 8 మంది మావోయిస్టులు, రూ. లక్ష రివార్డులతో 11 మంది మావోయిస్టులు రూ. 50 వేల రివార్డులతో ముగ్గురు మావోయిస్టులు ఉన్నారు. దంతెవాడలోని డిఆర్ జి కార్యాలయంలో డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (రేంజ్) సిఆర్ పిఎఫ్ దంతెవాడ రేంజ్ రాకేష్ చౌదరి, పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్, కమాండెంట్ 111వ, 195వ 230వ బెటాలియన్ సిఆర్ పిఎఫ్, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రామ్ కుమార్ బర్మాన్ ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో శుక్రవారం మావోయిస్టులందరూ లొంగిపోయారు. బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ, బస్తర్ లో శాశ్వత శాంతి, గౌరవం సమగ్ర అభివృద్ధి దిశగా పూనా మార్గెం (పునరావాసం ద్వారా పునరుద్ధరణ) కార్యక్రమం ముందుకు వెళ్తున్నది అని భారత ప్రభుత్వం, ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం, దంతేవాడ పోలీసులు, సి ఆర్ పీ ఎఫ్ , బలగాలు ఈ ప్రాంతంలో శాంతి నిర్మాణం, పునరావాసం సమగ్ర అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

ఫార్మింగ్ కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో బయో డైవర్సిటీ పార్కు ఏర్పాటు, రూ.5 కోట్లతో బాలికల వసతి గృహ నిర్మాణం, రూ.3 కోట్లతో 3 కిలోమీటర్ల బీటీ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక సాంకేతిక సేద్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, యాంత్రీకరణ సామగ్రితో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను మంత్రులు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం రైతు మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దివంగత నేత ఎన్టీఆర్ మంజూరుతో సుమారు 35 సంవత్సరాల క్రితం స్థాపించిన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల దేశ విదేశాల్లో నిపుణులను తయారు చేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థగా ఎదిగిందన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ కళాశాల కంటే మిన్నగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏ పంట వేసినా పండించే సామర్థ్యం ఉన్న రైతులు ఉన్నారని ప్రశంసించారు. ఆయిల్ పామ్ సాగులో కోకో, మిరియాలు, జాజి వంటి అనుబంధ పంటలను కూడా రైతులు విజయవంతంగా సాగు చేస్తున్నారని తెలిపారు. గిరిజన రైతులు అధికంగా ఉన్న ఈ జిల్లాలో గోదావరి జలాలతో పాటు అధిక ఆదాయం ఇచ్చే ఆధునిక పంటలను సాగు చేసి జిల్లా తెలంగాణకే కాకుండా దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారని, చిన్న, సన్నకారు, గిరిజన, బీసీ రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చొరవతో 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 2047 నాటికి వ్యవసాయ రంగం ద్వారా 400 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం రెండూ రైతులకు అత్యంత ఉపయోగకరమైన పథకాలన్నారు. గతంలో నిలిచిపోయిన యాంత్రీకరణ పథకాలను పునః ప్రారంభించి 50 శాతం సబ్సిడీతో రైతులకు యంత్ర పరికరాలు అందించడం శుభపరిణామమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.31 లక్షల మంది రైతులకు రూ.101 కోట్ల వ్యయంతో వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో నాచురల్, ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని, ఈ సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందన్నారు. వరి కొనుగోలులో 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో పాటు బోనస్ కూడా అందజేస్తున్నామని చెప్పారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గుమ్మడవెల్లి ప్రాజెక్టు రింగ్ బండ్ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ముడిపడి ఉన్నందున ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. అశ్వారావుపేటలోని అంకమ్మ చెరువు నుంచి లోతువాగు–దెబ్బతోగు ద్వారా గుమ్మడవెల్లి ప్రాజెక్టుకు నీరు చేరే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన భూసేకరణ కొంతవరకు పూర్తై, కొంత పెండింగ్ లో ఉందని పేర్కొంటూ భూ సేకరణను పూర్తి చేయాలని మంత్రులను కోరారు. మూకమామిడి ప్రాజెక్టు ద్వారా 7,675 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో వ్యవసాయ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ శాఖ మంత్రి దిశానిర్దేశంలో పలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, బయోచార్ తయారీ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువ రైతులు ఆధునిక సాంకేతికతతో వ్యవసాయంలోకి రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ యాంత్రీకరణను సమర్థవంతంగా వినియోగించుకొని రైతులు సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించే అవకాశం ఉందన్నారు. సమీకృత వ్యవసాయాన్ని అవలంబించాలని, ములకలపల్లి మండలం మొరంపల్లి బంజర గ్రామంలో మహిళలు సమీకృత వ్యవసాయం ద్వారా అధిక లాభాలు సాధిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమానికి పీజేటీఎస్ ఏయూ, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీలు జానయ్య, రాజిరెడ్డి, టీజీ ఆయిల్ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయశాఖ ప్రధాన కార్య దర్శి సురేంద్రమోహన్, వ్యవసాయశాఖ సంచాల కులు గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు, టీజీ ఆయి ల్ఫెడ్ ఎండీ ఎండీ శ్రీమతి యాస్మిన్బాషా హాజరు అయ్యారు. సమావేశంలో టీజీ ఆయిల్డ్ బోర్డు సభ్యుడు ఆలపాటి రామ చంద్రప్రసాద్, పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి అనువుగా గ్రామ పాలన

(మొదటి పేజీ తరువాయి...)

ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో పర్యటించి దీర్ఘకాలికంగా నెలకొన్న 76 జీఓను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత కొన్ని రోజుల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 69 శాతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులు గెలవడం గర్వకారణమన్నారు. ఇందిరమ్మ పాలనతోనే గ్రామపంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని, రానున్న మున్సిపల్, జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి మంచి ఫలితం సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మరియు ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా గెలిచిన సర్పంచులు సుపరిపాలన అందిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో గడిచిన రెండేళ్లలో ప్రజలకు అందించిన సుపరిపాలన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని, మరో మూడేళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా అనేక కార్యక్రమాలతో పాటు సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతుబంధు కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ లేని రుణాలు, సారె రూపంలో చీరలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న బడ్జెట్లో నిధుల కేటాయింపు చేస్తామన్నారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ హయాంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు దరి చేరుతాయని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని అందుకు ప్రజల ఆశీస్సులు దండుగా ఉన్నాయన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 101 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి గ్రామాల్లో సర్పంచులు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.

### మున్సిపాలిటిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 1, 4, 7, 9, 18, 22, 24 వార్డులలో రూ. 3.17 కోట్ల నగర అభివృద్ధి నిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూయ, నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, మండల రాము, చిల్లా శ్రీనివాస్, 5 మండలాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇల్లెందు డిఎస్పి చంద్రభాను, సిఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి







**ఇల్లందు, జనవరి 9, ప్రజాజ్యోతి:** రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఇల్లందు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టుల ఆదేశాల మేరకు శుక్రవారం కొత్త బస్టాండ్ ఏరియాలో ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్స వాల్లో భాగంగా న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, ముఖ్యంగా స్కూల్ పిల్లలకు తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు పరిమితిని మించి పిల్లలను తీసుకువెళ్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు పరిమితికి లోబడే పిల్లలను తప్పనిసరిగా షిఫ్ట్ ప్రకారంగా పిల్లలను సురక్షితంగా వారి ఇంటికి చేర్చాలని కోరారు. పాదాచారులు విధిగా జీబ్రా క్రాసింగ్ ద్వారానే రోడ్డు దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు జడ్జి ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపెల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, ఇల్లందు డిఎస్పి చంద్రబాను, సీఐ తాటిపాముల సురేష్, పోలీస్, కోర్టు సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## మార్గదర్శినిలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి
- ఆకట్టుకున్న రంగవల్లులు, కైట్స్ ఫెస్టివల్



**ఇల్లెందు టౌన్, జనవరి 9, ప్రజాజ్యోతి:** ఇల్లెందులో సంక్రాంతి శోభ ముందస్తుగానే వచ్చేసింది. పాఠశాలలకు సెలవులు కావడంతో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు రంగవల్లు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినులు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రాలంకరణలతో ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. వివిధ రంగవల్లులతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అంతేకాకుండా కైట్స్ ఫెస్టివల్ లో భాగంగా విద్యార్థులు పతంగులను ఎగురవేస్తూ ఎంజాయ్ చేశారు. పట్టణంలోని మార్గదర్శిని పాఠశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. విద్యార్థులు పండుగల యొక్క విశిష్టతలను తెలుసుకునేలా పాఠశాలలో కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## 25మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

- కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పేదలకు రూ.7,65,000 మేరకు లబ్ధి



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి:** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేద మధ్యతరగతి ప్రజానీకాన్ని ఆదుకునేందుకు.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్ )నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.7,65,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను విద్యానగర్ కాలనీలోని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో..కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, తదితరులుతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరేలా, ఆరోగ్య భరోసా లభించేలా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తితో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి:** లూయిస్ బ్రెయిలీ 217 వ జయంతి వేడుకలను జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సమావేశ హాల్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బ్రెయిలీ పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్ , జిల్లా సంక్షేమ శాఖ అధికారినీ జే.ఎం.స్వర్ణలతా లెనిన లు పాల్గొని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జయంతోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని మాట్లాడుతూ బ్రెయిలీ కనిపెట్టిన చుక్కల లిపి ద్వారా అందుల జీవితాలలో వెలుగులు నింపారని ఈ లిపి ద్వారా అందులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అదిరోహించారని, లూయిస్ త్యాగాన్ని కీర్తించారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని దివ్యాంగుల వివాహ ప్రోత్సాహం, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్,ఈపాస్ ద్వారా సహాయ ఉపకరణాలు,ఓబిఎంఎంఎస్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు, డి ఎం హెచ్ ఓ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, బ్రెయిలీ లిపి కనుగొనడం ద్వారా ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపారని అన్నారు. అంధులైన ఉద్యోగస్తులకు, అందుల కొరకు వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారికి సన్మానించి గోడ గడియారాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో బ్లైండ్ అసోసియేషన్ సభ్యులు ఎం.నరేందర్, రాజ్ కిరణ్, రమణయ్య, ఉపేంద్రమ్మ, అనుష,కిరణ్,వరప్రసాద్, నాగేశ్వరరావు,నరేష్,ప్రవీణ్ , డి హెచ్ ఈ డబ్ల్యు సిబ్బంది పాల్గొన్నారు.





## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9 ప్రజా జ్యోతి:** కుమారులు లేకపోవడంతో ఇంటికి పెద్ద కూతురే అన్నీ తానై తండ్రి చనిపోతే తలకొరివి పెట్టి తండ్రి రుణాన్ని తీర్చుకుంది. ఈ విషాద సంఘటన పాల్వంచ పట్టణంలోని వడ్డుగూడెంలో (గొల్లగూడెం )శుక్రవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, వడ్డుగూడెం లో నివసిస్తున్న ముదిగొండ కోటేశ్వరరావు అనే వ్యక్తి చంద్రుగొండ మండలం మద్దుకూరు లో వెటర్నరీ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో ఆయన బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు.. మృతునికి ఇద్దరు కుమార్తెలు పెద్ద కూతురు నవ్య, చిన్న కూతురు అస్మిత లు ఉన్నారు. పెద్ద కూతురు కెనడాలో భర్తతో కలిసి సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేస్తుండగా తండ్రి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే అక్కడి నుంచి విమానంలో శుక్రవారం ఉదయం పాల్వంచలో నీ తండ్రి ఇంటికి చేరుకుంది. మృతునికి కొడుకులు లేకపోవడంతో పెద్ద కుమార్తె నవ్య తండ్రికి తలకొరివిపెట్టి కన్నతండ్రి రుణాన్ని తీర్చుకుంది. ఈ సంఘటనను చూసిన బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులంతాకన్నీటి పర్యంతం అయ్యారు.

## నాణ్యమైన వైద్యాన్ని అందించాలి


### మంత్రి పొంగులేటి





**ఇల్లెందు, జనవరి 9, ప్రజాజ్యోతి:** ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రమైన ఇల్లందులో వైద్యశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమని, వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బుగ్గవాగు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రియాంక మెటర్నిటీ వైద్యశాలను మంత్రి, ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యంతో పాటు సకల సౌకర్యాలు ఇల్లెందులో ఏర్పాటుచేసి, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమని పేర్కొన్నారు. ఏజెన్సీలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. మహిళలకు ప్రసూతి, అత్యవసర వైద్య సేవలను వైద్యశాలలో అందించనున్నట్లు వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షుగర్, బిపి, థైరాయిడ్, గుండె, జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యుడు డాక్టర్ శేఖర్ నాయక్ (ఎండీ), వైద్యురాలు డాక్టర్ ప్రియాంక (ఎంబీబీఎస్, యం యస్, ఓబీజీ) లు తెలిపారు. ఏపీసీలో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని వారు పేర్కొన్నారు.

## పెద్దమ్మ తల్లికి ఘనంగా పంచామృతాభిషేకం



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువు చేరిన పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం మాదిరిగా అమ్మవారికి పంచామృతాలతో వైభవంగా పంచామృతాభిషేకం పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు, ముందుగా ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు ,కుంకుమ, గాజులు, హారతి సమర్పించిన అనంతరం ఆలయంలోని అమ్మవారి మూల విరాట్ కు పంచామృతములతో అభిషేకం నిర్వహించి పంచ హారతులు నివేదన నీరాజనం లాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రజనీకుమారి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు

## మున్నూరు కాపు సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



**ఇల్లందు, జనవరి 9, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్నూరు కాపు సంఘ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు పింగళి నరేష్ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో కుల పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పింగళి నరేష్ మాట్లాడుతూ మున్నూరు కాపు కులస్తులందరూ ఐక్యతగా ఉండాలని కోరారు. మున్నూరు కాపు కులస్తులు ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, కోశాధికారి ఆకుల చందర్ రావు, సింగరేణి సర్వే ఆఫీసర్ రామ్మూర్తి, సింగరేణి యంవిటిసి మేనేజర్ పగడాల మహేష్, కులస్తులు కొక్కు నాగేశ్వరరావు, కటకం పద్మావతి, దంతాల ఆనంద్, పగడాల చందు, పోతునూరి మాధవ్, పెద్దినేని హరినాథ్ బాబు, రావుల రమేష్, ఆముదాల సతీష్, బంగారు కోట సాంబయ్య, రాఘవరపు రాకేష్, పెద్ది సుధాకర్, కొక్కు సరిత, కొక్కు సత్యనారాయణ, కొక్కు వెంకన్న, పోశం శంకర్, పలువురు మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ లో సంక్రాంతి సంబరాలు



**బూర్గంపహాడ్,జనవరి 9(ప్రజా జ్యోతి ):** మండలంలోని సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల నందు సంక్రాంతి పురస్కరించుకొని ముందస్తుగా సంక్రాంతి సంబరాలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్, కోకో కోలా కంపెనీవారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 80 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన రంగవల్లులు సంస్కృతి సంప్రదాయాలకు మేళ వంపుగా నిలిచి చూపరులను ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పండుగల్లో సంక్రాంతి పండుగ మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగ అని, ఈ పండుగకు పల్లెల్లో ధాన్యరాసులతో వర్ధిల్లుతాయని తెలిపారు.అనంతరం రంగువల్లుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల హెడ్ మిస్సెస్ స్వర్ణ కుమారి, కోకో కోలా కంపెనీ ఆర్గనైజర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చైనీస్ మంజాతో పతంగులు ఎగుర వేస్తే కఠినచర్యలు

- **చర్ల సి ఐ రాజవర్మ, ఎస్ ఐ .నర్సిరెడ్డి , కేశవ్**



**చర్ల, జనవరి 09(ప్రజా జ్యోతి ):** సంక్రాంతి పండుగ నేపథ్యంలో చైనీస్ మాంజ పై నిషేధం ఉన్నందున ఎవరైనా చైనీస్ మంజా తో పతంగులు అమ్మిన ఎగురవేసిన అట్టి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి అని అత్యంత ప్రమాద కరమైన చైనీస్ మాంజ తో పతంగులు ఎగురవేయడం వల్ల ఆ మంజా తాకి వ్యక్తులు మరణించడం జరుగుతుంది కాబట్టి మండలంలో వ్యాపారస్తులు అదేవిధంగా తల్లితండ్రులు పిల్లల విషయంలో జాగర్తగా ఉండి సంక్రాం తి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి అని చర్ల మండల సి ఐ రాజువర్మ , ఎస్ ఐలు నర్సిరెడ్డి ,కేశవ్ లు మండల ప్రజలకు విజ్ఞప్తి చేసారు .

# ఎం పి యు పి ఎస్ ఎర్రగుంట పాఠశాలలో సంక్రాంతి శోభ

- **ఘనంగా ముగిసిన ముగ్గుల పోటీలు**





**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి**

భోగి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వినూత్న కార్యక్రమాల నిలయమైన ఎంపియుపిఎస్ ఎర్రగుంటలో శనివారం మధ్యాహ్నం నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి వెంకటేశ్వరరావు , ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో గ్రామ మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు, ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణయితలుగా ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ సుగుణ , సుజాత పాత పాల్వంచ పాఠశాల నుండి ప్రభావతి , న్యాయ నిర్ణయతలుగా వ్యవహరించారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులలో విజేతలను నిర్ణయించడం వారికి కత్తి మీద సామే అయిందని వారు తెలిపారు. మన సాంప్రదాయాలను కొనసాగిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయ బృందాన్ని వారు కొనియాడారు. అనంతరం విజేతలకు వారు బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్య శాఖ అధికారి శ్రీరామమూర్తి ప్రత్యేక అతిధిగా పాల్గొని గ్రామస్తులను ప్రోత్సహించారు. ఇటువంటి కార్యక్రమాలను చేపట్టి మహిళల లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి లో ఈ పాఠశాల ముందు ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఎర్రగుంట సాంబశివరావు , అశ్విని కుమార్ , అన్వర్ ఖాన్ , బహుమతులకు ఆర్థిక సాయం అందించారు, ఇలాంటి కార్యక్రమాల వలన తమకు కూడా సంప్రదాయ విలువలు తెలిసి వచ్చాయని గ్రామస్తులు కూడా ప్రశంసించారు,. ఈ కార్యక్రమంలో భోగిమంటలు వాటి చుట్టూ చిన్నారులు నృత్యాలు చిన్నారులు వేసిన హరిదాసుల వేషాలు ఆకట్టుకున్నాయి , ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జెకె-5 ఓసీ ప్రాజెక్టులో నిర్వాసితులకు న్యాయం చేయాలి



**ఇల్లందు, జనవరి 9, ప్రజా జ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె-5 ఓసీ కొనసాగింపు ప్రాజెక్టులో నిర్వాసితులకు న్యాయం చేయాలని విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీలు కోరారు. శుక్రవారం ఇల్లందు మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి పుట్టిన ప్రాంతం ఇల్లందు గతంలో అనేక అండర్ గ్రాండ్ మైన్ ఉన్నా ఈ ప్రాంతంలో నేడు జెకే-5 కొనసాగింపు ఓపెన్ కాస్ట్ పై ఆధారపడి ఉందన్నారు. గతంలో వాణిజ్య, వ్యాపార సముదాయలకు కేంద్రంగా కళకళ ఆడిన ఇల్లందు, నేడు గనులు లేక వెలవెలబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెకె-5 కొనసాగింపు ఓసీ లో ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని, జెకె ఓసీ ప్రాజెక్ట్ ఇండ్లనూ కోల్పోతున్న ప్రతి కుటుంబానికి ఒకే దగ్గర ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. జెకె ఓసీ ప్రాజెక్ట్ లో ప్రభావితం కానీ, భూపేష్ నగర్, శేషగిరి బస్తీ, క్వార్టర్స్ ప్రాంతాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించి పట్టాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న (200 యూనిట్ ఉచిత కరెంట్ ) గృహజ్యోతి పథకం క్వార్టర్స్ ఏరియాలో తక్షణమే వర్తించేలా చూడాలని,ప్రాజెక్ట్ లో ప్రభావితం కానీ భూపేష్ నగర్, శేషగిరి బస్తీ, క్వార్టర్స్ ఏరియాలో ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయతీలోని భూపేష్నగర్, శేషగిరి బస్తీ సొంత ఇండ్లు, క్వార్టర్స్ రిపేర్ చేసుకొనే అవకాశం కల్పించాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. జెకె ఓసీలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చొరవ తీసుకోవాలన్నారు. స్పందించిన మంత్రి, ఎమ్మెల్యే విజయలక్ష్మి నగర్ పంచాయతీ ప్రజలకు జెకె 5 ఓసి పొడిగింపు ప్రాజెక్టు విషయంలో న్యాయం చూస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి మేడారానికి ప్రత్యేక బస్సు



**కొత్తగూడెం,జనవరి 9(ప్రజాజ్యోతి ):** సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకొనుటకై కొత్తగూడెం బస్టాండ్ నుండి మేడారంకు నేటి నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని కొత్తగూడెం డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి తెలిపారు . కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంత ప్రజలు సమ్మక్క సారలమ్మ దేవతలు దర్శించుకొనుటకు జనవరి 10 తేదీ నుండి ఉదయం 7 గంటలకు కొత్తగూడెం బస్టాం డ్ నుండి బయలుదేరి పాల్వంచ, మణుగూరు, ఏటూర్ నాగారం, తాడ్వాయి మీదుగా మేడారమునకు ఉదయం 11:15 చేరుకుంటుందని తిరిగి మధ్యాహ్నం 2:30 మేడారంలో బయలు దేరి, కొత్తగూడెం చేరుకుంటుంది. ఛార్జ్ పెద్దల కు రూ, 220/-,పిల్లలకు 140/- పాల్వంచ నుండి పెద్దలకు 200/- ,పిల్లల కు 110 /- గా నిర్ణయించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాల్సిందిగా డిఎం కోరారు.

## క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్




**ఇల్లందు, జనవరి 9, ప్రజాజ్యోతి:** గ్రామస్థాయి నుండి ఒక్కరిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. శుక్రవారం సీఎం కప్ ను జయప్రదం చేయాలని కోరుతూ టార్చి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుకు వచ్చి రాణించాలని కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుడ్యానికి ఇంతగానో దోహదపడతాయన్నారు. ఈనెల 17వ తేదీ నుండి జరగబోవు సీఎం కప్ క్రీడలలో ఔత్సాహితులైన క్రీడాకారులు ప్రతి ఒక్కరూ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, తహసిల్దార్ కోట రవికుమార్, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ

- **జీసీస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ**



**చర్ల, జనవరి 09:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ బృందం చర్ల బస్టాండ్ పెట్రోల్ బంక్ పక్కన హెల్త్ సెంటర్ కి కేటాయించిన ప్రభుత్వ భూమి అక్రమణకు గురి అయినదని మండల తాసిల్దార్ శ్రీనివాస్ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భగా జిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ చర్ల మండల కేంద్రం లో అయ్యప్ప హోటల్ వెనుక భాగంలో గల ప్రభుత్వ భూమి గతంలో హెల్త్ సెంటర్ కొరకు కేటాయించారని అదే భూమిలో ప్రైవేట్ సంస్థకు సంబంధించిన ఎయిర్టెల్ టవర్ ను ఏర్పాటు చేశారని ప్రభుత్వ భూములను ఇష్టాను రీతిగా కబ్జాలు చేయడం ప్రభుత్వ అధికారులు అంటే భయం భక్తి లేకుండా ఏజెన్సీ చట్టాలను గౌరవించకుండా ఖాళీ స్థలం కనబడితే చాలు ఆక్రమించుకొని వశపరచుకుంటున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల లోపం వలనే ఇలాంటి ఆకృత్యాలు జరుగుతున్నాయని తక్షణమే ఆ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఇర్ప ప్రకాష్. మడకం రాము. పూణెం ప్రతాప్. పూణేం వరప్రసాద్ పాల్గొన్నారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- తెలంగాణకు రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటాం
- డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు పూర్తిచేస్తే ఈ ఏడాది లోనే కొన్ని నియోజకవర్గాలకు సాగునీరు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 9, ప్రజా జ్యోతి**

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గోదావరి, కృష్ణ నదుల నుంచి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడు కుంటామని ఆయన అన్నారు.శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం గండుగులపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగవ పంప్ హౌస్ పనుల పురోగతిని, అలాగే మొత్తం ప్రాజెక్టు పనుల స్థితిగతులపై భారీ నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక వివరాలను మంత్రులకు వివరించారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతిపై స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించామని తెలిపారు. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 968 టీఎంసీల నీటి వాటా కేటాయించబడిందని, నీటి లభ్యత 75 శాతం దాటిన తర్వాత సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు లభించాయని చెప్పారు. తాగునీటి అవసరాలను కూడా ప్రత్యేకంగా లెక్కగట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పూర్తయ్యే అవకాశమున్న సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.19,324 కోట్ల వ్యయంతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 6 లక్షల 74 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించనున్నట్లు తెలిపారు.భూసేకరణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని వచ్చే ఆరు నెలల్లో భూసేకరణ కోసం రూ.5,000 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. భూసేకరణ పూర్తయిన వెంటనే రైతులకు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో గోదావరి, కృష్ణనదులపై తెలంగాణకు రావలసిన నీటి వాటా పరిరక్షణ కోసం అన్ని స్థాయిల్లో సమర్థవంతమైన పోరాటం కొనసాగుతోందన్నారు. కృష్ణ వాటర్ ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు సహా అన్ని వేదికలపై తెలంగాణకు రావలసిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని అన్నారు, అదేవిధంగా పోలవరం–నల్లమల్ల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణకు నష్టం కలిగించే ఏ అంశాన్నీ అంగీకరించబోమని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత బోర్డులకు, సుప్రీంకోర్టుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను తెలియజేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగే వరకు, రాష్ట్రానికి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకునే వరకు ప్రభుత్వం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యంగా పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు పూర్తిచేస్తే, ఈ ఏడాదిలోనే కొన్ని ప్రాంతాలకు సాగునీరు దించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిన విధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణానికి సుమారు రూ.4,000 కోట్ల రివైజ్డ్ అంచనాలకు అనుమతి లభించడంతో, టెండర్లు, బిల్లుల ప్రక్రియలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. గతంలో కేవలం మెయిన్ కెనాల్‌కే అనుమతులు ఉండటంతో డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ప్రాజెక్టులో భాగంగా లేవని గుర్తు చేశారు. మంత్రుల స్థాయిలో నిరంతర ఒత్తిడి తీసుకురావడం వల్ల మొదటి మూడు పంప్ హౌసులు ప్రారంభానికి రావడంతో పాటు, 18 లింక్ కెనాళ్లు, రాజీవ్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీళ్లు అందించే స్థాయికి పనులు చేరుకున్నాయని తెలిపారు. దీని ద్వారా ఇప్పటికే కొంత స్థిరీకరణ సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు.ఈ ఏడాది జూన్–జూలై నాటికి సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తిచేసి సత్తుపల్లి మండలాలకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. వచ్చే ఏడాదికి సంబంధించి నాలుగవ పంప్ హౌస్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సత్తుపల్లి ట్రంక్, నాలుగవ పంప్ హౌస్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను కోరారు.అదేవిధంగా జూలూరుపాడు పనులు పూర్తిచేసి పాలేరు నియోజకవర్గానికి లింక్ కెనాల్ ద్వారా నీళ్లు అందించేలా ర్యలు తీసుకోవాలని, ఎన్టీఆర్ కెనాల్ లింక్ కెనాల్ పనులు పూర్తైతే సత్తుపల్లి నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పనుల సందర్భంగా రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే మంత్రులు, జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని భూసేకరణ సమస్యలు లేకుండా పరిష్కరించాలని శాసనసభ్యులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, శాసనసభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆలస్యం లేకుండా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్‌తో పాటు భారీ నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు సంక్రాతి సంబురాలు

- శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో సంక్రాతి సందడి





**చర్ల, జనవరి 09: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం తేగడ లోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో ముందస్తు సంక్రాంతి పండుగ సంబురాలు నిర్వహించారు .ఈ కార్యక్రమం లో సాంప్రదాయాలను పిల్లలకి వివరిస్తూ ప్రదర్శనగా చూపారు . సంక్రాంతి తెలుగువారి అతిపెద్ద పండుగ అని ఇది పంట కోత తర్వాత వచ్చే సంబురం అని చెడును వదిలి మంచిని ఆహ్వానించేందుకు జరుపుకుంటారు అని ఇది భోగి, మకర సంక్రాంతి, కనుమ అని మూడు రోజులు వైభవంగా జరుపుకుంటాము అని సంక్రాంతి అంటే భోగి మంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు, పతంగులు, పిండివంటలు, కోడిపందాలతో ఇళ్లు ఊర్లు కళకళ లాడుతాయి అని, సంక్రాంతి అభివృద్ధి కి సూచన అని కొత్త పంటలు ధాన్యాలు, పిండివంటలతో అందరి ఇళ్ళు సమృద్ధిగా ఉంటాయి అని, సంక్రాంతి కి రైతులకి పశుపక్షాదులలు కృతజ్ఞతలు తెలపాలి అని సంస్థ డైరెక్టర్ లిఖిత విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా పండుగ వాతావరణాన్ని పాఠశాల ప్రాంగణంలో బాగా రూపొందించిన ఉపాధ్యాయులను, ఆయాని ప్రశంసించారు సంస్థకి వీరి సహకారం ఎంతో ఆనందం అని ఈ కార్యక్రమం టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో మిగిలిన వారి సహకారంతో జరిగింది అని, విద్యార్థులు బాగా ఉత్సాహంతో భోగి మంటచుట్టు చేరి ఆడి పాడి, ముగ్గుల, గాలిపటాల పోటీల్లో పాల్గొన్నారు అని ఆనందాన్ని వ్యక్తం చేశారు అని అన్నారు .ఈ సందర్భంగా రాజేశ్వరి టీచర్ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి భోగి రోజు ఉదయాన్నే నలుగుపిండితో తైలబ్యంగన స్నానాలు చెయ్యాలని చెడుని వదిలి మంచి వైపు మన ఆలోచన ఉండాలని ఎలానైతే భోగి మంటల్లో పాత సామాను దహింపచేస్తామో అలా అని వివరించారు. చంద్రకళ టీచర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి ఉత్తరాయణ పుణ్య కాలం ప్రారంభం అని, పిల్లలకి భోగి పళ్ళు పోసి ఆశీర్వదిస్తారు అని రైతులు కూడా ధాన్యపు రాశులతో ఎంతో సంతోషంగా పండుగ జరుపుకుంటారు అని తెలిపారు. పాఠశాల ఆవరణలో ఆనందంగా పాలు పొంగించి పరవాణ్ణం వండి పండుగని అందరి మధ్య వేడుకగా నిర్వహించారు. గొమ్ముగూడెం విద్యార్థి మనివరుణ్ హరిదాసు వేషంలో అందర్ని అలరించాడు. విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీ వాణి విద్యా నికేతన్ లో ముందస్తు సంక్రాంతి వేడుక



**చర్ల, జనవరి 09: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం శ్రీ వాణి విద్యా నికేతన్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులచే పల్లె పకృతి ని మరిపించే విధంగా ఆట పాటల తో,కోలాటం ఆటలతో రంగురంగుల ముగ్గులు వేసి ,భోగి మంటలు వేసి , గొబ్బెమ్మలతో అలంకరించి రంగ రంగ వైభవంగా సంక్రాంతి పండుగ విశేషాలను చిన్నారులకు అర్థమయ్యే విధంగా పాఠశాల కరెస్పాండంట్ పద్మజ మేడం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భో గి పళ్ళను పోశారు . సంక్రాంతి పర్వదినం అందరికీ అర్థమయ్యే విధంగా యజమాన్యం చిన్నపిల్లలను తీర్చిదిద్ది వారిని పూలతో ఆశీర్వదించడం గమనార్హం. చిన్నప్పటి నుండి చిన్నపిల్లలకు పండగ విశేషాలను తెలియచేయాలన్న సంకల్పంతో శ్రీ వాణి విద్యా నికేతన్ స్కూల్ యజమాన్యం ముందస్తుగా సంక్రాతి వేడుకలు నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# అవమానానికి గురై మహిళా మృతి

- అక్రమ సంబంధం అంట కట్టారని వేదన.
- వారం రోజులుగా మృత్యుతో పోరాడి మృతి.



**గుండాల ప్రజా జ్యోతి జనవరి 9.** అక్రమ సంబంధం అంట కట్టుకున్నారని నేపంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది గుండాల మండలం రోల్లగడ్డ తండాకు చెందిన బోడ మౌనిక పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండాల మండలం రోల్లగడ్డ తండకు చెందిన బోడ మౌనిక (30) అవమాన భారంతో పురుగుమందు తాగి వరంగల్ ఎంజీఎం లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది గత వారం రోజుల క్రితం మౌనిక గ్రామంలోని కొంతమంది బోడ సుమన్ బోడమోహన్ బోడా బిక్షం బానోత్ రమేష్ తనకు అక్రమ సంబంధం ఉందంటూ ప్రచారం చేస్తూ తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేయడంతో మనస్థాపాన గురై బుధవారం ఇంట్లో ఉన్న పురుగుమందు తాగినట్లు గుర్తించి' ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ తరలించగా వరంగల్ ఎంజీఎం లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు గుర్తించారు మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు మృతురాలి మూర్తిపై గ్రామంలో తీవ్ర ఉత్కంఠ నెలకొనగా వరంగల్ లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రోల్లగడ్డ తండాకు మృతదేహాన్ని తరలించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ముందస్తు భోగి - సంక్రాంతి సంబరాలు



**దమ్మపేట, జనవరి 9 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,దమ్మపేట మండలం, దుర్గం గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వెలిగిం చి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిహెచ్ చంద్రకళ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే ముఖ్యమైన పండుగ అని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, సంస్కారాలు, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భోగి పండుగ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. భోగి మంటల కార్యక్రమం విద్యార్థుల సందడితో విజయవంతంగా ముగిసింది.

# సీతారామంతో సశ్యశ్యామలం! రైతు కల సాకారం

- నాల్గో పంప్ హౌస్‌తో సాగునీటి భరోసా
- దమ్మపేట–అశ్వారావు పేటకు గోదావరి నీళ్లు
- సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం సశ్య శ్యామలం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు






**దమ్మపేట, జనవరి 9 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో నిర్మాణంలో ఉన్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నాలుగో పంప్ హౌస్ పనులను మరింత వేగవంతం చేసి రైతులకు సాగునీరు త్వరగా అందించాలి అని రాష్ట్ర నీటిపారుదల, సిఏడీ, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ–చేనేత–మార్కెటింగ్–టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు.గండుగులపల్లిలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ వద్ద స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి మంత్రులు ప్రాజెక్టు పనుల పురోగతిపై విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు పంపుల పనితీరు, కాలువల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పురోగతి, రైతులకు సాగునీరు అందించే విధానాలపై సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ,"రైతులకు సాగునీరు అందించడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సశ్యశ్యామలం కావాలన్నది నా జీవిత కోరిక. గత ప్రభుత్వంలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లోనే లేవు. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నాలుగో పంప్ హౌస్ పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి జలాలు అందుతాయి. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆశీస్సులతో ఈ ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రాష్ట్రానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని, రైతుల భవిష్యత్తు దీనితో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, అవసరమైన వనరులు సమకూర్చి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రాజెక్టు పురోగతిపై మంత్రులకు తాజా నివేదిక అందజేశారు. స్థానిక రైతులకు సాగునీరు అందేలా ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**భద్రాచలం, జనవరి 9 ,ప్రజాజ్యోతి :** సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిస్థాయి మినహాయింపు ఇవ్వాలని, అలాగే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి మద్దతుగా భద్రాచలంలో శుక్రవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొర్రాజుల గుట్ట జడ్పీ ఉన్నత పాఠశాల, జడ్పీ గర్ల్స్ హై స్కూల్, తాతకుడి సెంటర్ ప్రాథమిక పాఠశాల, యూపీఎస్ జగదీష్‌కాలనీ, బీసీ గురుకులం, మైనార్టీ గురుకులం తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమంలో భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి టి. రమ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, కొర్రాజుల గుట్ట జడ్పీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొనకంచి శ్రీనివాస్, యూటీఎఫ్ భద్రాచలం మండల అధ్యక్షుడు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.

## సీపీఐ శతవసంతోత్సవ ముగింపు సభను జయప్రదం చేద్దాం

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్



**భద్రాచలం, జనవరి 9 ,ప్రజాజ్యోతి :** సీపీఐ శతవసంతోత్సవాల ముగింపు సభను ఘనంగా జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాచలంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న సీపీఐ శతవసంతోత్సవాల ముగింపు సభను విజయవంతం చేయడం ప్రతి పార్టీ కార్యకర్త బాధ్యత అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే సీపీఐ కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, స్వదేశాభిమానం, స్వాతంత్ర్య ఆకాంక్షలను ప్రజల్లో రగిలించడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు.ఖమ్మం నగరంలో జరిగే ఈ భారీ సభకు సుమారు 5 లక్షల మందితో పాటు, దేశ విదేశాల నుంచి అనేక మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ చారిత్రక సభను విజయవంతం చేయడానికి మన ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, పట్టణ కన్వీనర్ మా రెడ్డి శివాజీ, ఏఐటిసి పట్టణ నాయకులు కంభం మెట్టు శ్రీను, జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్, భద్రాద్రి వెంకటేశ్వరరావు, ఎస్‌వీఎస్ నాయుడు, మీసాల భాస్కరరావు, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, శోభన్, రామారావు, సీతారామ రాజు, వెంకటమ్మ, భాస్కర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దసరా మండపంలో రామయ్యకు ఘనంగా రాపత్తు ఉత్సవం

- నేటి నుంచి విలాసోత్సవాలు ప్రారంభం



**భద్రాచలం, జనవరి 9 ,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం దసరా మండపంలో రాపత్తు సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు కోలాటాలు, భజనల మధ్య భక్తులకు దర్శనమిచ్చారు.రాపత్తు సేవ సందర్భంగా కళాకారులు అందించిన సంగీత గానం, నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వాయిద్యాల నాదంతో పాటు భక్తి గీతాల నినాదాల మధ్య ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈ రాపత్తు ఉత్సవ కార్యక్రమంలో మారుతి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ డా. ఎస్.ఎల్. కాంతారావు,డా. బి. సుబ్బరాజు, ఎస్.ఎన్.వి. రామారావు,డా. పి. రాజశేఖర్,డా. జి.వి.వి. సుదర్శన రావు,డా. జయభారతి,డా. ఏ. మోహన్ రావు,డా. బి. సీతారామ రాజు, జి. రాజా రెడ్డి, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.కాగా, నేటి నుంచి శ్రీరామాలయంలో విలాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

## సంక్రాంతి వేళ భద్రతే లక్ష్యం

- ఇంటికి తాళాలు – పోలీస్ సమాచారం తప్పనిసరి
- కోడిపందాలు, పేకాటకు నో ఛాన్స్ – ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి హెచ్చరిక



**దమ్మపేట, జనవరి 9 (ప్రజాజ్యోతి):** రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవుల నిమిత్తం బంధువుల వద్దకు వెళ్లేవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని దమ్మపేట ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి సూచించారు.ఇంటి నుండి బయటకు వెళ్లే సమయంలో బంగారు ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో వదిలి వెళ్లకుండా తమ వెంట తీసుకెళ్లాలని, అలాగే ఇళ్లకు తాళాలు వేసి పోలీస్ స్టేషన్‌లో ముందస్తుగా సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అట్టి సమాచారం అందిన ఇళ్ల వివరాలను పాయింట్ బుక్‌లో నమోదు చేసి, నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అలాగే సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాల స్థావరాలు నిర్వహించడం, పేకాట స్థావరాలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దమ్మపేట ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి హెచ్చరించారు.ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.